

# సందర్శకుల కోసం రాష్ట్రపతి విడిది

## ఆద్యంతం గుభాళింపులు

## భారతీయత ఉట్టిపడేలా స్వాగతాలు



దేశ పరిపాలన కేవలం ఉత్తర భారతదేశానికే పరిమితం కాకూడదని, దక్షిణ భారతదేశంలో కూడా ఏర్పాటు చేయాలని హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం నిర్మించారు. ఈ నిలయం దిల్లీలోని రాష్ట్రపతి భవనన్‌కు దీటుగా ఉంటుంది. **1805**లో బ్రిటీష్ అధికారులు బొల్లారం రాష్ట్రపతి నిలయాన్ని నిర్మించారు. అప్పట్లో వైశ్రాయ్ అతిథి గృహంగా పిలిచే వారు, అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన **1950**లో కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుంది. అప్పటి నుంచి రాష్ట్రపతి నిలయంగా పిలుస్తూ వస్తున్నారు. ఈ భవనానికి సుమారు **160** ఏళ్ల చరిత్ర ఉంది. రెండోసారి బొల్లారం రాష్ట్రపతి నిలయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చారు. దీనిపై మరిన్ని వివరాలు....

1805లో బ్రిటీష్ అధికారులు బొల్లారం రాష్ట్రపతి నిలయాన్ని నిర్మించారు. అప్పట్లో వైశ్రాయ్ అతిథిగృహహంగా పిలిచేవారు. దీనికి సమీపంలోని ఆంధ్రసబ్ ఏరియా కార్యాలయానికి వచ్చే రక్షణ అధికారులు ఇక్కడ విడిది చేసేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1950లో కేంద్రం తన ఆధీనంలోకి తీసుకొంది. అప్పటినుంచి రాష్ట్రపతి నిలయంగా పిలుస్తున్నారు.

★ సిపాయిల తిరుగుబాటు సమయంలో కోఠిలోని బ్రిటీష్ రెసిడెంట్పై దాడి జరగడంతో రెసిడెంట్ నివాసాన్ని బొల్లారానికి మార్చారు.

★ స్వాతంత్ర్యం అనంతరం బ్రిటీష్ రెసిడెంట్ నివాసాన్ని నిజాం స్వాధీనంచేసుకొన్నారు. 160 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ భవనాన్ని కేంద్రం నిజాం నుంచి రూ.60లక్షలకు కొనుగోలు చేసింది. అప్పటినుంచి దక్షిణాది నుంచి రాష్ట్రపతి పరిపాలన అందించాలన్న సంప్రదాయం మొదలైంది.

### ఒక్కొక్కరికీ రూ.50

రాష్ట్రపతి నిలయంలో ఆర్ట్ గ్యాలరీ, కోర్ట్ యార్డ్ ప్రాంతాలను అధికారులు ఆధునికీకరించారు. విజిట్ రాష్ట్రపతి భవన్ వెబ్ సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, బొల్లారంలోని రాష్ట్రపతి భవన్ గేటు దగ్గర కూడా టికెట్లు అమ్ముతారని తెలిపారు. భారతీయులకు ఒక్కొక్కరికీ రూ.50, విదేశీయులకు రూ.250 గా టికెట్ ధర నిర్ణయించారు.

★ 1984 వరకు అప్పటి రాష్ట్రపతి జైల్సింగ్తోపాటు అంతకుముందు ఏడుగురు రాష్ట్రపతులు ఏటా సందర్శించారు.

★ నీలం సంజీవరెడ్డి ఆరుసార్లు సందర్శించారు. 1991లో శాంతిభద్రతల సమస్యల వల్ల ఆరేళ్లపాటు రాష్ట్రపతి పర్యటన జరగలేదు.

★ శంకర్ దయాల్శర్మ భద్రత కారణాల వల్ల మొదట్లో రాలేకపోయిన తర్వాత 1995, 96లో రెండుసార్లు వచ్చి నాలుగు నెలలపాటు విడిది చేశారు. 2000లో కేఆర్ నారాయణన్ విడిది చేశారు. 2006లో అబ్దుల్కలాం రెండురోజులతో అతి తక్కువ కాలం విడిది చేశారు.

★ 2007లో రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ప్రతిభాపాటిల్ ఏటా శీతాకాల విడిది చేసేవారు. అంతకుముందున్న రాష్ట్రపతులు వర్షాకాలం, శీతాకాలంలో విడిది చేసేవారు. ప్రతిభాపాటిల్ పర్యటన తర్వాత రాష్ట్రపతులందరూ శీతాకాల విడిదిగా దక్షిణాదికి



వస్తున్నారు. విడిదిని 15 రోజుల నుంచి వారానికి పరిమితం చేశారు.

★ 2010లో ప్రతిభాపాటిల్ ఔషధవనాన్ని పెంచి కొత్త సంప్రదాయానికి తెరలేపారు. వనాన్ని ప్రజలు తిలకించేలా కొత్త సంప్రదాయాన్ని ప్రారంభించారు. అంతకుముందు నిలయం పరిసరాలకు ఎవరినీ అనుమతించేవారు కాదు. 2011 నుంచి రాష్ట్రపతి పర్యటన తర్వాత నిలయాన్ని ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంచుతున్నారు.

★ ఔషధ వనంతోపాటు, నక్షత్ర వనం ప్రత్యేకత కలిగి ఉన్నాయి. నక్షత్ర వనాన్ని ప్రణబ్ముఖర్జీ 2013లో అశోక మొక్క నాటి ప్రారంభించారు.

ఏడాదంతా.....

రాష్ట్రపతి దక్షిణాది విడిదిగా పేరొందిన బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం తలుపులు సందర్శకుల కోసం తెరుచుకున్నాయి. గతంలో ఏటా పదిహేను రోజుల పాటు మాత్రమే రాష్ట్రపతి నిలయం సందర్శనకు అధికారులు అనుమతినిచ్చేవారు. ప్రస్తుతం ఏడాదంతా సందర్శకులకు స్వాగతం పలకనున్నారు. ప్రతీ సోమవారంతో పాటు సెలవు రోజుల్లో మినహా ఏడాదిలో ఏ రోజైనా సరే బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని చూడొచ్చని అధికారులు తెలిపారు. ఈమేరకు సందర్శన సమయాలలో మార్పులు చేసిన తర్వాత బుధవారం ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము లాంఛనంగా ఈ సందర్శన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గతంలో 11 రోజులు మాత్రమే ప్రజలను అనుమతి ఉండేది రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించేందుకు ప్రజలు ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు.











## ఆస్ట్రేలియాతో తొలి టెస్ట్‌లో పాక్ ఘోర పరాజయం : టీమిండియాపై మైఖేల్ వాన్ ఆసక్తికర వ్యాఖ్యలు

లండన్ : ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో పాకిస్తాన్ ఘోర పరాభవం తరువాత ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ టీమిండియాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్వదేశంలో ఆస్ట్రేలియాతో తలపడగలిగే జట్టు భారత్ తప్ప మరేదీ కాదని స్పష్టం చేశాడు. పాకిస్తాన్‌పై ఆస్ట్రేలియా అద్భుత విజయం సాధించిందని, అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించిందని పేర్కొన్నాడు. నాథన్ లయన్ 500 వికెట్ల క్లబ్‌లోకి చేరడాన్ని అభినందించాడు. ఆస్ట్రేలియాను వారి దేశంలో ఢీకొట్టే జట్టు ఏదైనా ఉంది అంటే అది ఒక్క భారత జట్టు మాత్రమేనని తేల్చి చెప్పాడు. బీసీసీఐ నాణ్యమైన క్రికెటర్లను అందిస్తోందని ప్రశంసించాడు. వాన్ వ్యాఖ్యలపై టీమిండియా అభిమానులు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఆస్ట్రేలియాకు భారత్ పోటీ ఇస్తుందనేదాని కంటే ఓడించగలదంటే బాగుంటుందని కామెంట్ చేస్తున్నారు. ఆసీస్ అద్భుతంగా ఆడిందని, వార్నర్ చివరి సీరీస్‌లో విశేషంగా రాణించాడని ప్రశంసించారు. ఇక, పాకిస్తాన్ జట్టు పోటీ ఇవ్వకుండానే చేతులు ఎత్తేసిందని మరికొందరు విమర్శించారు. కాగా, పెర్త్‌లో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 360 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 487 పరుగులు చేయగా, రెండవ ఇన్నింగ్స్‌ను 233/5 వద్ద డిక్లేర్ చేసింది. ప్రతిగా తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులకు ఆలౌట్ అయిన పాకిస్తాన్ రెండవ ఇన్నింగ్స్‌లో 89 పరుగుల స్కోర్‌కే కుప్పకూలి ఘోర పరాజయం అందుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో వార్నర్ 164 పరుగులతో భారీ సెంచరీ నమోదు చేశాడు.



# రోహిత్ శర్మే కెప్టెన్

- కంగారు పడవద్దు
- హిట్ మ్యాన్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్
- రోహిత్ స్థానంలో హార్దిక్‌ను కెప్టెన్ చేసిన ముంబయి ఇండియన్స్
- అవమానంగా భావిస్తూ రగిలిపోతున్న హిట్ మ్యాన్ ఫ్యాన్స్
- అయితే టీ20 వరల్డ్ కప్ టోర్నీలో రోహితే కెప్టెన్ అంటున్న బీసీసీఐ వర్గాలు




ముంబయి : ఇటీవల జరిగిన పరిణామాలతో తీవ్ర నిరాశలో ఉన్న రోహిత్ శర్మ అభిమానులకు గుడ్ న్యూస్. ముంబయి ఇండియన్స్ రోహిత్ శర్మ అభిమానులను బాధించే ప్రకటన చేసినా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నుంచి మాత్రం హిట్ మ్యాన్ ఫ్యాన్స్‌కు అదిరిపోయే సంకేతాలు అందాయి. 2024 జూన్‌లో జరగనున్న టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌కు రోహిత్ శర్మే తమ ఫస్ట్ ఛాయిస్ కెప్టెన్ అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. 2022లో జరిగిన టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో టీమిండియా సెమీస్‌లోనే ఇంటి ముఖం పట్టిన తరువాత రోహిత్ శర్మ మళ్లీ టీ20 మ్యాచ్‌లలో ఆడని సంగతి విదితమే. అప్పటి నుంచి హార్దిక్ పాండ్య టీ20 మ్యాచ్‌లలో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. హార్దిక్ టీ20 మ్యాచ్‌లలో కెప్టెన్ అని బీసీసీఐ అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ అతనినే కెప్టెన్‌గా కొనసాగిస్తున్నారు. వన్డే వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో భారత్ ఫైనల్‌లో ఓడిన తరువాత సౌతాఫ్రికాతో టీ20 మ్యాచ్‌లు, వన్డే మ్యాచ్‌లు ఆడేందుకు రోహిత్ సుముఖత వ్యక్తం చేయలేదు. దీనితో వచ్చే ఏడాది జరగనున్న టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో హార్దిక్ ఫస్ట్ ఛాయిస్ కెప్టెన్ అని అందరూ భావించారు. ముంబయి ఇండియన్స్ హార్దిక్ పాండ్యను ట్రేడింగ్ ద్వారా కొనుగోలు చేయడం, కొన్ని రోజులకే అతనిని కెప్టెన్‌గా ప్రకటించడంతో రోహిత్ ఫ్యాన్స్ షాక్ అయ్యారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా టీ20 కెప్టెన్సీకి హార్దిక్ వైపే మొగ్గు చూపుతుందేమోననే భావన వ్యక్తమైంది. కానీ, ముంబయి ఇండియన్స్ నిర్ణయం ప్రభావం బీసీసీఐపై లేదని తెలుస్తోంది. వచ్చే టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో టీమిండియాకు హార్దిక్ పాండ్యే సారథ్యం వహిస్తాడా అని న్యూస్ పేపర్ ప్రతినిధి ఒకరు అడిగిన ప్రశ్నకు బీసీసీఐ అధికారి ఒకరు కాదని సమాధానం ఇచ్చారు. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించడం అనేది ఒక ఫ్రాంచైజీ తీసుకున్న నిర్ణయం మాత్రమేనని, దాని ప్రభావం టీమిండియాపై ఉండదని ఆయన తెలిపారు. అన్ని ఫార్మాట్లలోనూ కెప్టెన్‌గా రోహిత్ కొనసాగుతాడని చెప్పారు. ఢిల్లీ వేదికగా టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌లతో జరిగిన సమావేశంలో రోహిత్ వర్చువల్‌గా పాల్గొన్నాడని తెలుస్తోంది. టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్ కెప్టెన్‌గా ఇప్పుడే తన పేరు ఖరారు చేయాలని ఈ భేటీలో రోహిత్ కోరినట్లు సమాచారం. దీనికి ద్రావిడ్, అగార్కర్ మౌఖికంగా అంగీకరించారని తెలుస్తోంది. టోర్నీకి మరి ఆరు నెలలు సమయం ఉన్నందున అధికారిక ప్రకటన వెలువడలేదని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. టీమిండియాకు రోహిత్ సహజమైన కెప్టెన్ అని, బీసీసీఐ అతనిన్ని కెప్టెన్సీ నుంచి తప్పించలేదని బీసీసీఐ అధికారి తెలిపారు. ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్య పేరు ప్రకటించిన సమయంలో రోహిత్ శర్మ ధీరూభాయ్ అంబానీ స్కూల్ వార్షిక ఫంక్షన్‌లో ఉన్నాడు. రోహిత్ ఇంకా సౌతాఫ్రికా బయలుదేరి వెళ్లలేదు. ఈ నెల 26న ప్రారంభం కానున్న రెండు టెస్ట్ మ్యాచ్‌ల సీరీస్‌లో రోహిత్ టీమిండియా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. 2013 సీజన్ మధ్యలో రిక్కీ పాంటింగ్ కెప్టెన్సీ నుంచి తప్పుకున్న సమయంలో ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన రోహిత్ ఆ సీజన్‌లో ముంబయికి తొలి ఐపీఎల్ టైటిల్ విజయం అందించాడు. చాంపియన్స్ లీగ్‌లోనూ విజేతగా నిలిపాడు. రోహిత్ సారథ్యంలో ముంబయి ఇండియన్స్ 2015, 2017, 2019, 2020 సీజన్‌లలోను టైటిళ్లు సాధించింది.

## ముంబయి కెప్టెన్ మార్పుపై హార్దిక్‌కు అనుకూలంగా స్పందించిన మాజీ ఆటగాడు



ముంబయి : ఐపీఎల్-2024 సీజన్‌కు ముంబయి ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాను ప్రకటించడంపై క్రికెట్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. పది సంవత్సరాల పాటు జట్టుని విజయవంతంగా నడిపించిన హిట్‌మ్యాన్‌ను మార్చడంపై రకరకాల అభిప్రాయాలు, విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాకు అనుకూలంగా టీమిండియా మాజీ బ్యాట్స్‌మన్ సంజయ్ మంజ్రేకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ విషయంలో సెంటిమెంటల్‌గా లేదా ఎమోషనల్‌గా ఆలోచించవద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానని మంజ్రేకర్ చెప్పాడు. కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యా నిరూపించుకున్నాడని, కనుక ఇది మంచి నిర్ణయమేనని ముంబయి ఇండియన్స్ నిర్ణయాన్ని మంజ్రేకర్ సమర్థించాడు. టీ20 మ్యాచ్‌లలో టీమిండియాకు పాండ్యా కెప్టెన్‌గా ఉన్నాడనే విషయాన్ని మరచిపోకూడదని, ఆటగాళ్ల జడ్జిమెంట్‌లో సెంటిమెంట్లను తీసుకురావద్దని ప్రతి ఒక్కరినీ కోరుతున్నానని అన్నాడు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డే మ్యాచ్‌కు సంబంధించిన చర్చలో స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ మంజ్రేకర్ ఈ వ్యాఖ్యలు చేశాడు. హార్దిక్ పాండ్యా ఫామ్‌లో ఉన్న ఆటగాడని, ఈ పరిణామాలు అన్నింటినీ అతను ఒత్తిడిగా భావించకూడదని మంజ్రేకర్ సూచించాడు. ముంబయి ఇండియన్స్ ఎంత నమ్మకంతో మద్దతు తెలుపుతోందో గుర్తు ఉంచుకోవాలని అన్నాడు. కాగా, ఐపీఎల్ 2024 ఎడిషన్‌కు రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాను కొత్త కెప్టెన్‌గా ముంబయి ఇండియన్స్ ప్రకటించింది. మూడు రోజుల క్రితం చేసిన ఈ ప్రకటన రోహిత్ శర్మ ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురి చేసింది. కాగా రోహిత్ శర్మ పదికి పైగా ఎడిషన్లలో ముంబయి జట్టుకు సారథ్యం వహించాడు. ఏకంగా ఐదు టైటిల్స్ కూడా అందించాడు. ఇక 2015లో ముంబయి ఇండియన్స్‌లో హార్దిక్ పాండ్యా ఐపీఎల్ కెరియర్ ప్రారంభించాడు. అయితే 2022 మెగా వేలానికి ముందు హార్దిక్‌ను ముంబయి విడుదల చేయడంతో గుజరాత్ టైటాన్స్ కొనుగోలు చేసింది. కెప్టెన్‌గా బాధ్యతలు అప్పగించింది. తొలి ఏడాది 2022లో పాండ్యా టైటిల్ గెలిపించాడు. నిరుడు కూడా టీమ్‌ని ఫైనల్‌కు తీసుకువచ్చిన విషయం విదితమే.

# ఎవరీ మల్లికా సాగర్?

- ఐపీఎల్ తొలి మహిళా ఆక్షనీర్ గురించి ఆసక్తికర విశేషాలు
- ఐపీఎల్ చరితల్రోనే తొలి మహిళా ఆక్షనీర్‌గా మల్లికా సాగర్
- రెండు సార్లు డబ్ల్యూపీఎల్ వేలం నిర్వహించిన గుర్తింపు
- 2001 నుంచి అనేక సార్లు వేలం నిర్వహించిన అనుభవం




ముంబయి : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో తొలిసారి వేలం ప్రక్రియను దేశం వెలుపల నిర్వహించనున్నారు. ఐపీఎల్ 2024 వేలం దుబాయిలో జరగనున్నది. ఈసారి ఐపీఎల్ వేలానికి మరొక ప్రత్యేకత కూడా ఉంది. 16 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో తొలిసారి ఐపీఎల్ వేలం ప్రక్రియను ఒక మహిళ నిర్వహించనున్నారు. ముంబయికి చెందిన మల్లికా సాగర్ ఈసారి ఐపీఎల్ వేలం నిర్వహించనున్నారు. ఐపీఎల్ వేలం నిర్వహించనున్న నాలుగవ వ్యక్తి మల్లిక కావడం గమనార్హం. రిచర్డ్ మ్యాడ్లీ దాదాపు పది సంవత్సరాల పాటు ఐపీఎల్ వేలం నిర్వహించారు. 2008 నుంచి 2018 వరకు ఐపీఎల్ వేలంపాటను ఆయనే నిర్వహించారు. ఆ తరువాత 2023 వరకు హ్యూజ్ ఎడ్మియేడ్స్ ఐపీఎల్ ఆక్షనీర్‌గా వ్యవహరించారు. 2022 మెగా వేలం సమయంలో మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా వేలం మధ్యలోనే ఎడ్మియేడ్స్ హాస్పిటల్ పాలవడంతో చారు శర్మ వేలం ప్రక్రియను కొనసాగించారు. ఐపీఎల్ వేలం నిర్వహించిన తొలి భారతీయుడు చారు శర్మే. ఐపీఎల్ వేలాన్ని ఆరంభం నుంచి నిర్వహించనున్న తొలి ఇండియన్‌గా మల్లిక రికార్డులకు ఎక్కుతున్నారు. అంతే కాదు. ఐపీఎల్ చరిత్రలో తొలి మహిళా ఆక్షనీర్ కూడా ఆమే కావడం విశేషం. మల్లికా సాగర్‌కు వేలం ప్రక్రియ నిర్వహించడంలో ఎంతో అనుభవం ఉంది. 2023 విమెన్స్ ప్రీమియర్ లీగ్‌తో పాటు ఇటీవల జరిగిన డబ్ల్యూపీఎల్ 2024 వేలాన్ని సైతం ఆమే నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె ఐపీఎల్ వేలాన్ని సైతం నిర్వహిస్తారనే ప్రచారం జరిగింది. 2021లో ప్రొ కబడ్డీ లీగ్ వేలం నిర్వహించిన అనుభవం కూడా ఆమెకు ఉంది. ముంబయికి చెందిన ఆర్ట్ కలెక్టర్ అయిన మల్లిక ఆధునిక, సమకాలీన భారత కళల్లో ఆమె నిపుణురాలు. ముంబయిలోని ప్రముఖమైన పండోలి ఆర్ట్ గ్యాలరీలోను వేలం నిర్వహించిన అనుభవం ఆమెకు ఉంది. 2001 నుంచి ఆమెకు వేలం నిర్వహించిన అనుభవం ఉంది. 26 ఏళ్ల వయసులో ఆమె తొలిసారి వేలం ప్రక్రియ నిర్వహించారు. సమకాలీన ఇండియన్ ఆర్ట్ వేలం ప్రక్రియను నిర్వహించిన తొలి వ్యక్తి ఆమే కావడం గమనార్హం. ఐపీఎల్ 2024 వేలం విషయానికి వస్తే మంగళవారం దుబాయిలోని కోకా కోలా అరేనాలో భారతీయ కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభం కానున్నది. స్టార్ స్పోర్ట్స్ చానెళ్లతో పాటు జియో సినిమా యాప్‌లో ఈ వేలం ప్రక్రియను చూడవచ్చు. మొత్తం 333 మంది ఆటగాళ్లు వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వారిలో 214 మంది భారతీయులు కాగా, 119 మంది విదేశాలకు చెందిన వారు. అసోసియేట్ దేశాలకు చెందిన ఇద్దరు ఆటగాళ్లు కూడా వేలం కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ వేలంలో 77 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు కొనుగోలు చేయనున్నాయి. వారిలో గరిష్టంగా 30 మంది విదేశీ ఆటగాళ్లు ఉండనున్నారు.

## డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్ర స్థానానికి దూసుకెళ్లిన టీమిండియా




దుబాయి : డబ్ల్యూటీసీ 2023-25 (వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్) పాయింట్ల పట్టికలో టీమిండియా అగ్ర స్థానానికి దూసుకువెళ్లింది. పెర్త్ వేదికగా జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా చేతిలో పాకిస్తాన్ ఏకంగా 360 పరుగుల తేడాతో ఘోర ఓటమి పాలవ్వడం భారత్‌కు కలసి వచ్చింది. పాకిస్తాన్ (24) వద్ద భారత్ (16) కంటే ఎక్కువ పాయింట్లే ఉన్నప్పటికీ గెలుపు శాతం విషయంలో ఇరు జట్లు 66.67 శాతంతో సమానంగా ఉన్నాయి. ఈ ఏడాది టీమిండియా ఒకే టెస్ట్ సీరీస్ ఆడింది. జూలైలో వెస్టిండీస్‌తో జరిగిన సీరీస్‌ను 1-0తో గెలిచింది. ఒక మ్యాచ్‌లో విజయం సాధించగా మరొక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. దీనితో భారత్ ఖాతాలో 16 పాయింట్లు ఉన్నాయి. మరొక వైపు పాకిస్తాన్ ఈ ఏడాది శ్రీలంకపై 2-0 తేడాతో టెస్ట్ సీరీస్‌ను గెలుచుకుంది. అయితే, ఆస్ట్రేలియాపై 3 మ్యాచ్‌ల టెస్ట్ సీరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి పాలవ్వడంతో పాక్ గెలుపు శాతం దిగజారింది. దీనితో భారత్, పాకిస్థాన్ సమానంగా ఉన్నాయి. అయితే, పాకిస్తాన్ ఖాతాలో ఒక ఓటమి కూడా ఉండడంతో భారత్ అగ్ర స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియాపై మిగతా రెండు మ్యాచ్‌లలోను ఓడితే పాకిస్తాన్ మరింత కిందికి దిగజారే అవకాశం ఉంటుంది.

## భారీ యాక్షన్ ప్లాన్‌తో వేలంలోకి పంజాబ్ కింగ్స్

# ఈ సారైనా ఆ లోటు పూడేనా?



దుబాయి : గత ఐపీఎల్ వేలంలో పంజాబ్ కింగ్స్ ఎలెవెన్ జట్టు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ రికార్డు ధర రూ. 18.50 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ కారణంగా సామ్ కరన్ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా మారాడు. అయితే, ఐపీఎల్ 2023లో ఆశించిన రీతిలో రాణించలేకపోయాడు. అందుకే ఈ సంవత్సరం వేలానికి ముందు పంజాబ్ కింగ్స్ అతనిని విడుదల చేసింది. ఇది కాకుండా పంజాబ్ కింగ్స్ ఈ ఏడాది ఖరీదైన మరొక భారత ఆటగాడు షారుక్ ఖాన్‌ను కూడా విడుదల చేసింది.

**వేలంలో పంజాబ్ వ్యూహం ఏమిటి?**


ఐపీఎల్ 2024 కోసం మంగళవారం దుబాయిలో వేలం నిర్వహించనున్నారు. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1 గంటలకు వేలం ప్రారంభం అవుతుంది. ఈ వేలంలో పంజాబ్ కింగ్స్ వద్ద రూ. 29.10 కోట్లు మిగిలాయి. ఈ వేలానికి ముందు వారు 17 మంది ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నారు. ఖరీదైన ఐదుగురు ఆటగాళ్లను మాత్రమే విడుదల చేశారు. దీనితో ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ వద్ద మొత్తం 8 స్లాట్‌లు మిగిలి ఉన్నాయి. వాటిలో విదేశీ స్లాట్‌ల సంఖ్య రెండు మాత్రమే.

**స్పిన్నర్లపైనే పంజాబ్ కింగ్స్ చూపు**

పంజాబ్ కింగ్స్ జట్టు తమ జట్టులో విదేశీ స్పిన్నర్‌ను చేర్చుకోవడానికి ప్రయత్నించవచ్చు. అయితే, రాహుల్ చాహర్, హర్‌ప్రీత్ బ్రౌన్ రూపంలో ఇద్దరు భారత ఆటగాళ్ల రూపంలో స్పిన్ ఎంపికలు ఉన్నాయి. కానీ, వారిద్దరూ చాలా ఎక్కువ ఎకానమీ రేట్లు కలిగి ఉండడంతో, పంజాబ్ కింగ్స్ అయోమయంలో పడింది. ఈ క్రమంలో తక్కువ ఎకానమీ రేట్ కలిగిన మంచి స్పిన్ బౌలర్ కోసం ఆ జట్టు చూస్తోంది. ఇంగ్లాండ్‌కు చెందిన ఆదిల్ రషీద్, న్యూజిలాండ్‌కు చెందిన రచిన్ రవీంద్ర లేదా శ్రీలంకకు చెందిన వనిందు హసరంగా వంటి ఆటగాళ్లను దక్కించుకునేందుకు పంజాబ్ జట్టు ఎదురుచూస్తోంది.

# నేడే ఐపీఎల్ ఆటగాళ్ల వేలం

- దుబాయిలో ఏర్పాట్లు పూర్తి
- మరి కొన్ని నెలల్లో ఐపీఎల్-2024 సీజన్
- వేలానికి మొత్తం 333 మంది ఆటగాళ్లు
- విదేశీ ఆటగాళ్ల సంఖ్య 119




దుబాయి : ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన క్రికెట్ లీగ్‌గా ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) గుర్తింపు తెచ్చుకుంది. ఆటగాళ్లకు ఇచ్చే పారితోషికం మొదలు, ఫ్రాంచైజీల ఆదాయం, బ్రాండ్ నేమ్, ప్రసార హక్కుల విలువ, అభిమానుల ఆదరణ... ఇలా ఏ అంశం చూసినా ఐపీఎల్‌కు సాటిగా నిలిచే క్రికెట్ లీగ్ మరొకటి లేదు. కాగా, ఐపీఎల్-2024 సీజన్ కోసం ఇప్పటి నుంచే సన్నాహాలు మొదలయ్యాయి. ఐపీఎల్ 2024 సీజన్ కోసం ఆటగాళ్ల వేలం ప్రక్రియను మంగళవారం (19న) దుబాయిలో నిర్వహించనున్నారు. ఈ వేలం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ వేలంలో మొత్తం 10 ఫ్రాంచైజీలు పాల్గొంటాయి. మొత్తం 333 మంది ఆటగాళ్ల నుంచి తమకు కావలసిన వారిని కొనుగోలు చేయనున్నాయి. ఈసారి వేలంలో 119 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు.

ఇటీవల వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో అందరి దృష్టిని ఆకర్షించిన న్యూజిలాండ్ యువ సంచలనం రచిన్ రవీంద్ర, వరల్డ్ కప్ టోర్నమెంట్ ఫైనల్‌లో సెంచరీతో మెరిసిన ఆసీస్ ఆటగాడు ట్రావిస్ హెడ్, దక్షిణాఫ్రికా యువ పేసర్ గెరాల్డ్ కోట్జీ మంగళవారం వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. వారికి అత్యధిక ధర పలికే అవకాశాలు ఉన్నాయి. ఆక్షనీర్‌గా మల్లికా సాగర్ వ్యవహరిస్తారు. మల్లికా సాగర్ ఇటీవల విమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలం నిర్వహించారు. ఐపీఎల్ వేలం ప్రక్రియను స్టార్ స్పోర్ట్స్ చానల్‌లోను, జియో సినిమా ఓటీటీ వేదికలోనూ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆటగాళ్ల వేలం ప్రారంభం కానున్నది.

**ఈసారి వేలంలో 13 మంది తెలుగు రాష్ట్రాల క్రికెటర్లు**

ఈసారి వేలంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నవారిలో తెలుగు రాష్ట్రాల క్రికెటర్లు 13 మంది కూడా ఉన్నారు. వారిలో హనుమ విహారి, కేఎస్ భరత్, రికీ భుయ్, పృథ్వీరాజ్ ఎర్రా ఆంధ్రా క్రికెట్ సంఘానికి చెందినవారు కాగా, రవి తేజ, మనీశ్ రెడ్డి, మురుగన్ అభిషేక్, ఆరవెల్లి అవనీశ్ రావు, తనయ్ త్యాగరాజన్, రక్షణ్ రెడ్డి, రాహుల్ బుద్ధి, అనికేత్ రెడ్డి, రోహిత్ రాయుడు హైదరాబాద్ క్రికెట్ సంఘానికి చెందినవారు. వారిని ఏ ఫ్రాంచైజీలు ఎంపిక చేసుకుంటాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. వారిలో హనుమ విహారి, కేఎస్ భరత్ టీమిండియా టెస్ట్ ప్లేయర్లు.

